AKSHARA TODAY
అక్షర టుడే
TOWARDS... TRUTH, TRUST, TREND
WWW.AKSHARATODAYNEWS.COM
17-8-2026 (Monday) MAIN EDITION

## అదరగొట్టిన ఐపీవోలు




**అక్షరటుడే, బిజినెస్ డెస్క్:** దేశీయ స్టాక్ మార్కెట్‌లో సోమవారం రెండు కంపెనీలు లిస్టయ్యాయి. రెండూ ఇన్వెస్టర్లకు మంచి లాభాలను అందించాయి. ఎలక్ట్రికల్ డిస్ట్రిబ్యూషన్ సిస్టమ్స్, వైరింగ్ హార్నెస్‌ల డిజైన్, తయారీ, పంపిణీలో అనుభవమున్న ధూత్ ట్రాన్స్‌మిషన్ లిమిటెడ్ కంపెనీ లిస్టింగ్ సమయంలోనే 37.7 శాతం లాభాలు ఇచ్చింది. మోల్బియో డయాగ్నోస్టిక్స్ కంపెనీ ఐపీవో ద్వారా రూ. 939.70 కోట్లు సమీకరించింది. కంపెనీ ఒక్కో ఈక్విటీ షేరును రూ. 807కి విక్రయించగా.. రూ. 980 వద్ద లిస్టయ్యాయి.

## మోటోరోలా నుంచి మిడ్ రేంజ్ ఫోన్




**అక్షరటుడే, బిజినెస్‌డెస్క్:** మోటోరోలా భారత మార్కెట్‌లో మరో మోడల్ ఫోన్‌ను విడుదల చేసింది. మోటో జీ మ్యాక్స్ 5జీ పేరుతో దీనిని తీసుకువచ్చింది. మోటో జీ సిరీస్ నుంచి వచ్చిన మరొక స్మార్ట్ ఫోన్ ఇది. 7000 ఎంఏహెచ్ బ్యాటరీ, స్నాప్‌డ్రాగన్ 6ఎస్ జెన్ 4 ప్రాసెసర్, ఆండ్రాయిడ్ 16 ఆపరేటింగ్ సిస్టంతో తీసుకువచ్చిన ఈ ఫోన్ ధర రూ. 27,999. ఫ్లిప్‌కార్ట్ తో పాటు మోటోరోలా అధికారిక వెబ్‌సైట్‌లో ఆగస్టు 20 మధ్యాహ్నం 12 గంటల నుంచి సేల్ అందుబాటులోకి రానుంది.

## గోడ కూలి విద్యార్థి మృతి



**అక్షరటుడే, ఏపీ:** ఏపీలో ప్రభుత్వ పాఠశాల ప్రహరీ కూలి పదో తరగతి విద్యార్థి మృతి చెందాడు. మన్యం జిల్లా సాలూరు ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ఈ ఘటన చోటు చేసుకుంది. ఆడుకోవడానికి గ్రౌండ్‌కి వెళ్లిన విద్యార్థులు గోడపై కూర్చున్నారు. ఆ గోడ పాతది కావడంతో కూలిపోయింది.

## బీజేపీ నూతన కార్యవర్గం



**అక్షరటుడే, న్యూఢిల్లీ :** బీజేపీ నూతన జాతీయ కార్యవర్గాన్ని ప్రకటించింది. 13 మందికి జాతీయ ఉపాధ్యక్ష పదవులు ఇచ్చింది. బీజేపీ జనరల్ సెక్రెటరీగా స్మృతి ఇరానీని నియమించింది. ఉపాధ్యక్షులుగా రాంమాధవ్, పురందేశ్వరి, వసుంధర రాజే తదితరులు నియామకం అయ్యారు.

## మాజీ మంత్రి ఎర్రబెల్లి పాదయాత్ర



**అక్షరటుడే, వరంగల్:** వరంగల్ జిల్లాలో మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావు పాదయాత్ర చేశారు. ఎస్సారెస్పీ కాలువ ద్వారా సాగు నీరు అందించాలని డిమాండ్ చేస్తూ పాదయాత్ర చేపట్టారు. పాలకుర్తి నియోజకవర్గం పరిధిలోని మైలారం నుంచి నీరు లేని కాలువలో ఆయన యాత్ర చేపట్టి నిరసన తెలిపారు.



# ఆలయంలో తొక్కిసలాట

**బీహార్‌లోని లఖీసరాయ్ జిల్లాలో ఉన్న అశోక్ ధామ్ ఆలయం ఆవరణలో సోమవారం తొక్కిసలాట చోటు చేసుకుంది. ఈ ఘటనలో ఏడుగురు భక్తులు మృతి చెందారు. మరికొందరు తీవ్రంగా గాయపడ్డారు. శ్రావణ సోమవారం సందర్భంగా ఆలయానికి పెద్ద ఎత్తున భక్తులు తరలి వచ్చారు. విద్యుత్ స్తంభం కూలిపోవడంతో విద్యుత్ తీగ జనసమూహంపై పడిందన్న వదంతులతో.. ప్రజలు భయంతో పరుగులు తీశారు. దీంతో తొక్కిసలాట చోటు చేసుకుంది.**

**- అక్షరటుడే, నేషనల్ డెస్క్**

■ ఏడుగురు భక్తుల మృతి ■ బీహార్‌లో విషాదం ■ పరిహారం ప్రకటించిన ప్రభుత్వం

అశోక్ ధామ్ ఆలయానికి శ్రావణ మాసంలో పెద్ద ఎత్తున భక్తులు వస్తుంటారు. సోమవారం సైతం అధికంగా భక్తులు తరలి వచ్చారు. ఈ క్రమంలో తొక్కిసలాట చోటు చేసుకుని ఏడుగురు మహిళలు చనిపోయారు. సమాచారం అందుకున్న పోలీసులు, సహాయక బృందాలు ఘటన స్థలానికి చేరుకున్నాయి. క్షతగాత్రులను సమీపంలోని ఆస్పత్రికి తరలించాయి.

### రూ.4 లక్షల పరిహారం

ఈ ఘటనపై బీహార్ సీఎం సామ్రాట్ చౌదరి దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. గాయపడిన వారికి సరైన, తక్షణ వైద్య చికిత్స అందేలా చూడాలని అధికారులను ఆదేశించారు. మరణించిన వారి కుటుంబాలకు ఒక్కొక్కరికి రూ. 4 లక్షల చొప్పున ఆర్థిక సహాయం ప్రకటించారు. లఖీసరాయ్ జిల్లా మేజిస్ట్రేట్ శైలేంద్ర కుమార్ మాట్లాడుతూ.. ఉదయం 6.30 నుండి 6.45 గంటల మధ్య రెండు రైళ్లు రావడంతో భక్తుల రద్దీ అసాధారణంగా పెరిగిందన్నారు.

### వదంతుల వ్యాప్తితో..

జనాల ఒత్తిడి కారణంగా ఒక వైపు బారికేడ్ విరిగిపోవడంతో ప్రజలు ఒకరిపై ఒకరు పడిపోయారు అని అధికారులు తెలిపారు. ఆ సమయంలో కేబుల్ వైర్ కింద పడగా.. విద్యుత్ వైరు అని ప్రచారం జరగడంతో భక్తులు భయంతో పరుగులు తీశారని చెప్పారు. దీంతో తొక్కిసలాట చోటు చేసుకుందని తెలిపారు. అశోక్ ధామ్ ఆలయాన్ని శ్రీ ఇంద్రదమనేశ్వర మహాదేవ ఆలయం అని కూడా పిలుస్తారు. శ్రావణ మాసంలో ఈ ఆలయానికి పెద్ద ఎత్తున భక్తులు వస్తుంటారు. తొక్కిసలాట ఘటనపై పోలీసులు, అధికారులు విచారణ చేస్తున్నారు.

## వ్యక్తుల కంటే పార్టీయే సుప్రీం : మంత్రి జూపల్లి



**అక్షరటుడే, ఆదిలాబాద్ :** ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా ఇన్‌ఛార్జి మంత్రి జూపల్లి కృష్ణారావు కీలక వ్యాఖ్యలు చేశారు. వ్యక్తుల కంటే పార్టీయే సుప్రీం అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన హామీలను ఒక్కొక్కటిగా నెరవేరుస్తోందన్నారు. వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లో ప్రజలు మరోసారి కాంగ్రెస్ పార్టీ వైపే మొగ్గు చూపడం ఖాయమని ధీమా వ్యక్తం చేశారు. ప్రజలకు సేవ చేసిన నాయకులు, పార్టీ కోసం కష్టపడి పనిచేసిన వారికి భవిష్యత్తులో తగిన అవకాశాలు లభిస్తాయని పేర్కొన్నారు. ఆసిఫాబాద్ జిల్లాలో కాంగ్రెస్ పార్టీ ముఖ్య నాయకుల మధ్య ఉన్న గ్రూపు విభేదాలు పార్టీ బలోపేతానికి ఆటంకంగా మారకూడదన్నారు. నేతలు అందరు సమష్టిగా పనిచేయాలని సూచించారు.

## దక్షిణ కొరియాకు ట్రంప్ షాక్..



**అక్షరటుడే, నేషనల్ డెస్క్:** ఇరాన్ విషయంలో అమెరికాకు మద్దతుగా నిలవడానికి మిత్రదేశమైన దక్షిణ కొరియా విముఖత వ్యక్తం చేసింది. దీంతో తీవ్ర అసంతృప్తికి గురైన అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ఆ దేశానికి షాకిచ్చారు. దక్షిణ కొరియాతో నిర్వహించే సంయుక్త సైనిక విన్యాసాలను గణనీయంగా తగ్గించాలని తన రక్షణ శాఖను ఆదేశించారు. ఉత్తర కొరియా అధ్యక్షుడు కిమ్ జోంగ్ ఉన్‌తో ఉన్న సత్సంబంధాల కారణంగానే ఈ నిర్ణయం తీసుకున్నట్లు ట్రంప్ తన 'ట్రూత్' సోషల్ మీడియా ఖాతా ద్వారా వెల్లడించారు.

## నారా లోకేశ్ కీలక ప్రకటన



**అక్షరటుడే, ఏపీ :** ఆంధ్రప్రదేశ్ అసెంబ్లీ వర్షాకాల సమావేశాల్లో విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్ డీఎస్సీ నిర్వహణపై కీలక ప్రకటన చేశారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీ మేరకు ప్రతి సంవత్సరం డీఎస్సీ నిర్వహిస్తామని స్పష్టం చేసిన ఆయన.. అత్యంత బాధ్యతగా కేవలం 148 రోజుల్లోనే డీఎస్సీ నియామక ప్రక్రియను విజయవంతంగా పూర్తి చేసినట్లు సభకు వెల్లడించారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ప్రభుత్వ విద్యా రంగంలో అనేక విప్లవాత్మక మార్పులు తీసుకువచ్చినట్లు మంత్రి వివరించారు. ముఖ్యమంత్రి ఆదేశాల మేరకు ఉపాధ్యాయుల నియామకాలు, బదిలీలను అత్యంత పారదర్శకంగా నిర్వహిస్తున్నట్లు తెలిపారు.


## రాహుల్ గాంధీకి ఊరట



**అక్షరటుడే, ఢిల్లీ :** కాంగ్రెస్ అగ్రనేత, లోక్‌సభ ప్రతిపక్ష నాయకుడు రాహుల్ గాంధీకి సుప్రీంకోర్టులో ఊరట లభించింది. ఆయనపై ఆదాయానికి మించిన ఆస్తుల కేసులో దర్యాప్తు జరపాలంటూ అలహాబాద్ హైకోర్టు ఇచ్చిన ఆదేశాలపై సోమవారం సర్వోన్నత న్యాయస్థానం స్టే విధించింది. ఈ కేసులో ఎటువంటి దర్యాప్తు నివేదికలను హైకోర్టుకు లేదా ఇతర సంస్థలకు సమర్పించవద్దని సీబీఐ, ఈడీలను ఆదేశించింది. అలాగే, అలహాబాద్ హైకోర్టులో ఈ కేసుకు సంబంధించి జరుగుతున్న విచారణను నిలిపివేయాలని సూచించింది.

## హోటల్‌లో అగ్నిప్రమాదం.. ఏడుగురి దుర్మరణం

**అక్షరటుడే, నేషనల్ డెస్క్:** పశ్చిమ బెంగాల్‌లోని ప్రసిద్ధ పుణ్యక్షేత్రమైన బీర్భూమ్ జిల్లా తారాపీఠ్‌లో సోమవారం తెల్లవారుజామున భారీ అగ్నిప్రమాదం సంభవించింది. ఓ నాలుగు అంతస్తుల హోటల్ గ్రౌండ్ ఫ్లోర్‌లో ఉదయం 5 గంటల సమయంలో ఒక్కసారిగా మంటలు వ్యాపించాయి. ఆ సమయంలో అతిథులందరూ గాఢ నిద్రలో ఉండటంతో తీవ్ర ప్రాణనష్టం జరిగింది. ఈ దుర్ఘటనలో ఊపిరాడక, మంటల్లో చిక్కుకుని ఏడుగురు అక్కడికక్కడే ప్రాణాలు కోల్పోగా, మరి కొందరు తీవ్రంగా గాయపడ్డారు. సమాచారం అందుకున్న వెంటనే అగ్నిమాపక సిబ్బంది ఘటనా స్థలానికి చేరుకుని తీవ్రంగా శ్రమించి మంటలను అదుపులోకి తెచ్చారు. ఈ ప్రమాదం విద్యుత్ షార్ట్ సర్క్యూట్ కారణంగానే జరిగి ఉండవచ్చని హోటల్ నిర్వాహకులు ప్రాథమికంగా అంచనా వేస్తున్నారు.



## తమిళనాడుకు సుప్రీంకోర్టు కీలక సూచన

**అక్షరటుడే, తమిళనాడు:** కావేరీ నదీ జలాల పంపక వివాదంలో మరో కీలక పరిణామం చోటుచేసుకుంది. తమిళనాడుకు నీటిని విడుదల చేయాలంటూ కావేరీ వాటర్ మేనేజ్మెంట్ అథారిటీ ఇచ్చిన ఆదేశాలను కచ్చితంగా పాటించాలని కర్ణాటక ప్రభుత్వానికి సుప్రీంకోర్టు స్పష్టం చేసింది. కావేరీ వాటర్ రెగ్యులేషన్ కమిటీ సిఫార్సుల మేరకు.. తమిళనాడుకు రోజుకు 12,000 క్యూసెక్కుల చొప్పున 12 రోజుల పాటు నీటిని విడుదల చేయాలని సీడబ్ల్యూఎంఏ ఆదేశించిన విషయం తెలిసిందే. ఈ ఆదేశాలను కర్ణాటక ప్రభుత్వం అమలు చేయలేదంటూ తమిళనాడు సర్కార్ సుప్రీంకోర్టును ఆశ్రయించింది. విచారించిన సర్వోన్నత న్యాయస్థానం అథారిటీ జారీ చేసిన ఆదేశాలను విస్మరించకూడదని తేల్చిచెప్పింది.






## మెఫెంథెర్మిన్ ఇంజెక్షన్లు విక్రయిస్తున్న ముగ్గురి అరెస్ట్

**అక్షరటుడే, హైదరాబాద్ సిటీ :** చట్టవిరుద్ధంగా మెఫెంథెర్మిన్ సల్ఫేట్ ఇంజెక్షన్లను నిల్వ ఉంచి విక్రయిస్తున్న ముగ్గురు వ్యక్తుల ముఠాను హైదరాబాద్ సిటీ పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. విశ్వసనీయ సమాచారం మేరకు ఫలక్‌నుమాలోని నవాబ్ సాహెబ్ కుంట ప్రాంతంలో దాడి చేశారు. మహమ్మద్ జుబేర్ అలియాస్ జుబేర్ 'ఇండియా మార్ట్' ఆన్‌లైన్ ప్లాట్‌ఫామ్ ద్వారా తక్కువ ధరకు ఇంజెక్షన్లను ఆర్డర్ చేసి, థర్డ్ పార్టీ కొరియర్ సేవల ద్వారా తెప్పించుకుంటున్నట్లు గుర్తించారు. రూ.5 వేలకు 30 ఇంజెక్షన్ల ప్యాక్‌ను కొనుగోలు చేసి, ఒక్కో ఇంజెక్షన్‌ను ₹1,000 చొప్పున విక్రయిస్తూ అక్రమంగా సొమ్ము చేసుకుంటున్నట్లు తెలిపారు.

## రాయికి మహిమలు ఉన్నాయని మోసం

**అక్షరటుడే, హైదరాబాద్ :** నకిలీ పంచలోహ లక్ష్మీదేవి విగ్రహం, మహిమలు ఉన్నాయంటూ ప్రచారం చేసిన ఒక రాయిని అధిక ధరలకు విక్రయించి మోసాలకు పాల్పడుతున్న ముఠాను పోలీసులు అరెస్ట్ చేశారు. ఈ కేసుకు సంబంధించిన వివరాలను హైదరాబాద్ సిటీ కమిషనర్ టాస్క్‌ఫోర్స్ డిప్యూటీ కమిషనర్ ఆఫ్ పోలీస్ వైభవ్ రఘునాథ్ వెల్లడించారు. ఆరుగురు నిందితులు ఒక ముఠాగా ఏర్పడ్డారు. లక్ష్మీదేవి విగ్రహం, గులాబీ రంగు రాయికి దివ్య శక్తులు ఉన్నాయని ప్రచారం చేశారు. వాటిని అమ్మేందుకు యత్నించగా పోలీసులు దాడి చేసి అరెస్ట్ చేశారు.

